# రవ్వ

అనగా అనగా -

ఓ వూరికి రాజు. ఎక్కడ ఉండేవాడో తెలియదు కాని ఆ వూళ్లో కామయ్య అనే కామందు మాత్రం ఉండేవాడు. ఆ వూరికి అతను మకుటంలేని మహారాజు.

అదే వూళ్లో కండల కనకయ్య అనే నిరుపేద కూడా ఉండేవివాడు. అతనికి రవ్వల రాజా అనే కొడుకుండేవాడు. ఆ కుర్రవాడు పుట్టీపుట్టగానే తల్లి చనిపోయింది. కనకయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. చేసుకోగలిగిన ఆర్థిక స్తోమత అతనికి లేకపోయింది. అతను కూలిపని చేసుకొని జీవించేవాడు. అయితే ఏడాదికి సుమారు మూడునెలలు మాత్రమే అతనికి కూలిపని దొరికేది. మిగతా రోజుల్లో అతనూ, అతని కొడుకూ మలమల మాడిపోతుండేవారు.

ఆ వూరికి ఉత్తరంగా బంగారుకొండ అని ఓ కొండ ఉండేది (అది ఇప్పుడు కూడా ఉంది) ఆ కొండ చుట్టూరా సాగుకి వీలుపడకుండా రాళ్ళతో నిండిన నేల చాలామేరకి విస్తరించుకొని ఉండేది.

కొడుక్కి అయిదోయేడు వచ్చేసరికి కండల కనకయ్య పరిస్థితి చాలా దిగజారిపోయింది. మహా సముద్రం మధ్యలో చిక్కుకుపోయిన నావికుడు అందులోంచి మంచినీరు పుట్టించనైనా పుట్టించాలి లేకపోతే చావనైనా చావాలి అనేటటువంటి విషమ పరిస్థితిలో పడినట్లు అటువంటి స్థితిలో పడ్డాడు కనకయ్య. తిండిని పండించి ఆకలి తీర్చుకొందకి అతనికి ఊళ్లో ఎక్కడా సూదిమొన మోసే స్థలమైనా దొరికింది కాదు. అందుచేత అతను అయిదేళ్ళ కొడుకుని వెంటబెట్టుకొని ఊరిబైటికి పోయి బంగారుకొండ వారబంద రాళ్ళని కొడుకు సాయంతో పగలగొట్టి పెకలించ నారంభించేడు. ఆ విధంగా వాళ్ళిద్దరూ మూడు సంవత్సరాలు అహోరాత్రాలు కష్టపడి కొంతనేలని చదును చేసుకొని, దున్నుకుని గంపెడాశతో కొన్ని గింజలు జల్లుకొని పైరు పెంచుకొని పంట కోసుకొని, వంట చేసుకొని కూర్చొని తినబోతుండగా.

కామయ్య కామందు రాజభటులతోసహా వచ్చి ఆ నేలంతా "నాది" అన్నాడు. అందుకు నిదర్శనంగా రాజముద్ర వేసిన కాయితం ఒకటి చూపించేడు. ఆ నేలనంతా కామయ్యే కష్టపడి ఆదా చేసుకొని బాగుచేసుకొని సాగు చేసుకొన్నందుకు రాజుగారు మెచ్చుకొని ఆ దినమే అతనికి ఆ నేలంతా దానం చేస్తూ ఇచ్చిన పట్టా అది.

ఆ నేలనంతా బాగుచేసి సాగుచేసినది తనే కాని కామయ్యకాదు అని కండల కనకయ్య న్యాయస్థానంలో వ్యాజ్యం చేసేడు. కనకయ్య పక్షాన అతనూ, అతని ఎనిమిదేళ్ళ కొడుకు రవ్వలరాజూ సాక్ష్యం చెప్పేరు. అతని పక్షాన మరెవరూ ముందుకి రాలేకపోయేరు. ఊళ్లో చదువుల్నేర్చినవారూ, వ్యాపారాలు నేర్చినవారూ, పన్నులు సేకరించేవారూ, అంతాకూడా

కామయ్య పక్షాన నిల్చేరు. అందుచేత వ్యాజ్యంలో కామయ్య నెగ్గేడు. తను ఓడిపోయేనని వినగానే కండలు కరిగిన కనకయ్య గుండె పగిలి చనిపోయేడు. అప్పటికి రవ్వల రాజుకి తొమ్మిదే యేళ్ళు.

అంతట కామయ్య కామందు రాజ భటులతో సహా మళ్ళీ వచ్చి ఆ నేలని స్వాధీనం చేసుకోబోయేడు. అతను వ్యాజ్యంలో అధర్మంగా నెగ్గి ఆ విధంగా దుర్మార్గంగా ప్రవర్తించడం చాలా దారుణం అని ఊళ్ళో చాలామంది అనుకున్నారే కాని అందులో ఒక్కరైనా కూడా కామయ్యని అడ్డుకోందికి గాని అతనికి బుద్ధి చెప్పడానికి కాని ముందుకు రాలేదు.

మరేముంది, ఇక అంతా అయిపోయింది అని అందరూ అనుకొనే సమయంలో ఆ వూళ్ళోంచి ఒక్కడు మాత్రం లేచి ముందుకు వచ్చేడు. అతను ఆ నేలకి వెళ్లేదారికి అడ్డుగా గుట్టలా రాళ్ళు పోగుచేసుకుని రాళ్ళ పక్క నిల్చొని కామయ్యనీ, రాజభటుల్నీ అటు వెళ్ళనివ్వకుండా ఆటకాయించేడు. అతనికి కామయ్య, భటులు కూడా కాయితాలు చూపించేరు? కాయితాల ప్రకారం ఆ నేలంతా కామయ్యదన్నారు.

కాని, అతను వప్పుకోలేదు. కాయితాల ప్రకారం ఆ నేల కామయ్యదవొచ్చు, కాని నిజం ప్రకారం మాత్రం అది కామయ్యది కాదన్నాడతను.

అప్పుడు అతనికి, రాజభటులకి మధ్య ఘర్షణ జరిగింది. శాంతియుతంగా అతడు వెళ్ళిపోవలసిందిగా రాజభటులు కోరారు. అతనందుకు నిరాకరించేడు. అప్పుడు కామయ్యని వెనవేసుకుని భటులంతా మేటతోపుగా నేలమీదికి వెళ్ళబోయేరు. అప్పుడితను చాలా కోపం తెచ్చుకొని వాళ్ళ మీదికి రాళ్ళ వర్షం కురిపించేడు. ఓ రాయి కామయ్య కాలికీ, మరో రాయి అతని వేలికీ, మరో రాయి ఓ రాజభటుడి పాగా చిగురికీ, మరోరాయి మరొకరికీ ఇంకోరాయి ఇంకొకరికీ ఇలా తగిలేయి, ఆ విధంగా అతను రాజాజ్ఞని ధిక్కరించి ఆంత హింసాత్మకంగా వర్తించినందుకు రాజభటులు ఈటెలు విసిరి అతన్ని చంపి నేలని కామయ్యకి స్వాధీనం చేసి ఆ విధంగా రాజాజ్ఞని ప్రజలు పాటించేట్టు చేయవలసి వచ్చింది. అతటితో ఆ రవ్వల రాజుకి ఈ నేలమీద నూకలాశ అవసరం లేకపోయింది. ఆ దినంతో అతనికి తొమ్మిదేళ్ళు నిండిపోయేయి.

★ ★ ★

ఆ కామయ్య కామందుగారి మునిమనవల మునిమనవల ముని మనవలే ప్రస్తుతం మా జిల్లా అధికార్లంతాను.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 29-5-1970*

---

ద్వైతాద్వైతం కథలోని మొదటి కథ పెద్దపులిది, రెండో కథ నల్లమేకది.